# ఉద్యోగాలు ఇప్పిస్తాని మోసం చేసిన వ్యక్తి అరెస్టు

## జిల్లా వ్యాప్తంగా 16 కేసులు నమోదు



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** మైక్రో ఫైనాన్స్ తోపాటు ప్రభుత్వ ఆసుపత్రులు, అంగన్వాడీలలో ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ ఏజెంట్లను ఏర్పాటు చేసుకొని వందల మందిని మోసం చేసిన ప్రధాన నిందితుడు జవాడే కృష్ణ ను అరెస్టు చేసి రిమాండ్ కు తరలించినట్లు జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. బుధవారం స్థానిక పోలీసు ఏఆర్ హెడ్ క్వార్టర్స్ లోని సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజలను మోసం చేసిన వారు ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని, ప్రతి ఒక్కరూ చట్టప్రకారం శిక్ష అర్హులని అన్నారు. అమాయక ప్రజలను బురిడీ కొట్టించి ఉద్యోగాలు ఇస్తానంటూ డబ్బులు వసూలు చేసి, జల్సాలకు ఖర్చు చేసి, సామాజిక సేవ పేరుతో ప్రముఖుల పరిచయాలతో ప్రచారం చేసుకుని, ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ జిల్లాలో దాదాపు 300 మందిని మోసం చేసిన ఇంద్రవెల్లి మండలం శంకరగూడ గ్రామానికి చెందిన జవాడే కృష్ణ తోపాటు ఐదుగురు వ్యక్తుల్లో ఆత్రం



నారాయణ, డాకురే శత్రుఘన్, మధ్యవర్ ఆదినాథ్ లను అరెస్టు చేయడం జరిగిందన్నారు. మిగితా ఇద్దరు ఆత్రం రాహుల్, మిశ్రమ ప్రహల్లాద్ పరారీలో ఉన్నారని తెలిపారు. ప్రజలను మోసం చేసిన వారిని విడిచి పెట్టేది లేదని హెచ్చరించారు. నిందితునిపై ఆదిలాబాద్ జిల్లాలో దాదాపు 16 కేసులు నమోదయ్యాయని తెలిపారు. ఉట్నూర్ లో- 3, ఇంద్రవెల్లిలో- 3, నార్నూర్ లో-2, మావల లో-3, ఆదిలాబాద్ వన్ టౌన్ లో-2, జైనథ్ లో-3 చొప్పున దాదాపు కేసులు నమోదైనట్లు పేర్కొన్నారు. 2024 సంవత్సరం డిసెంబర్ ఆదిలాబాద్ జిల్లా కేంద్రం, ఉట్నూర్ లో ఎన్ఆర్ఐ అంటూ ఎస్కే మైక్రో ఫైనాన్స్ పేరుతో కార్యాలయాలను ప్రముఖులతో ప్రారంభించి తన నేర పద్ధతిని ప్రారంభించాడని అన్నారు. మైక్రో ఫైనాన్స్ లో ఉద్యోగాలు ఇప్పిస్తానని జిల్లా వ్యాప్తంగా రెండు కార్యాలయాల్లో దాదాపు 300 మంది వద్ద రూ.20వేల సభ్యత్వం తీసుకుని ఉద్యోగాలు కల్పించడం జరుగుతుందని చెప్పి మోసం చేశాడని అన్నారు. అదేవిధంగా ప్రభుత్వ ఆసుపత్రులలో స్టాఫ్ నర్స్, ఏఎన్ఎం, అంగన్వాడీ ఉద్యోగాలు ఇప్పిస్తానని కొంత మంది వద్ద డబ్బులను తీసుకొని మోసానికి పాల్పడినట్లు చెప్పారు. మొదటగా ఈ రెండు కార్యాలయాల్లో ఐదుగురు ఏజెంట్లను ఏర్పాటు చేసుకోవడం, వారి ద్వారా నగదు రూపంలో ఒక్కొక్కరి వద్ద రూ.20 వేలు తీసుకొని దాదాపు జిల్లా వ్యాప్తంగా 54 లక్షలు, అదేవిధంగా ప్రభుత్వ సంస్థల్లో ఉద్యోగాల పేరుతో రూ.15 లక్షలు వసూలు చేసి మొత్తం రూ.69 లక్షలు ఇప్పటివరకు వసూలు చేసినట్టు విచారణలో తేలిందన్నారు. ఈ డబ్బు అంతా భవిష్యత్తులో దొరకకుండా నగదు రూపంలో స్వీకరించడం జరిగిందని తెలిపారు. డిసెంబర్ నుంచి ఆరు నెలల పాటు ఈ కార్యక్రమాలు చేసి ఉద్యోగాలు ఇవ్వకపోవడంతో బాధితులు తరచూ అడుగుతూ ఉండడంతో జూలై నెల మొదటి వారంలో తన సొంత గ్రామం శంకరగుడా లో రూ.9లక్షల నగదు, మూడు లక్షల విలువ చేసే బంగారు ఆభరణాలు దాచి, రూ.15 లక్షల నగదు తో పారిపోవడం జరిగిందన్నారు. మొత్తం 10.7 తులాల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకోవడం జరిగిందని తెలిపారు. బాధితులు ఇంకా ఎవరైనా ఉంటే జిల్లా పోలీస్ యంత్రాంగాన్ని సంప్రదించాలని సూచించారు. ఈ సమావేశంలో ఉట్నూర్ ఏఎస్పీ కాజల్ సింగ్, ఉట్నూర్ సీఐ ఎం ప్రసాద్, ఐటీ కోర్ ఎస్సై గోపికృష్ణ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్ల



**ఉద్యమ కెరటం, దహెగాం:** భారీ వర్షాలకు మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కాగజ్ నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్ల తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశానుసారం మండలంలోని లోతట్టు ప్రాంత ప్రజలను అప్రమత్తం చేయడం జరిగిందన్నారు. పోలీస్ సిబ్బంది, గ్రామ పంచాయతీ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యను ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు తెలియజేయాలని ఆదేశించారు. అత్యవసరమైతే తప్పా ప్రజలు బయటికి వెళ్లవద్దని సూచించారు. వాగులు, వంకలు, ఒర్రెలు, లోలెవల్ వంతెనలు దాటే ప్రయత్నం చేయవద్దన్నారు. అత్యవసర సమయంలో డయల్ 100 నెంబర్, పోలీస్ కంట్రోల్ రూమ్ నం. 8712670551 కు సమాచారం అందించాలని తెలిపారు. మండలంలోని ముంపు ప్రాంతమైన పెసరికుంట గ్రామాన్ని బుధవారం దహెగాం తహశీల్దార్ మునవీర్ షరీఫ్ తో కలిసి సందర్శించారు. పెసరికుంట గ్రామం ముంపు ప్రాంతం, పెద్దవాగు పరివాహక ప్రాంతం అయినందున భారీ వర్షాల కారణంగా గ్రామ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కుమురంభీం ప్రాజెక్టు గేట్లు ఎత్తినందున పెద్దవాగులో నీరు భారీగా చేరే అవకాశం ఉందని, గ్రామ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వరద ఎక్కువ వస్తే ఇంట్లో నీరు చేరే 12 కుటుంబాలను గ్రామంలోని చర్చి లో పునరావాసం ఉండాలని తెలిపారు. తత్కాలికంగా రాత్రి అందులో ఉండాలని, శాశ్వత పరిష్కారం చూపిస్తామని అన్నారు.



# తాండూర్ మండలంలో కుండపోత వర్షం

## పలు గ్రామాల్లో ఇండ్లలోకి చేరిన వర్షపు నీరు

**ఉద్యమ కెరటం, తాండూర్:** తాండూర్ మండలంలో ఎడతెరిపి లేకుండా కురిసిన కుండపోత వర్షానికి పలు గ్రామాల్లో వరద నీరు ఇళ్లలోకి చేరి స్థానికులను అతలాకుతల%శీ% చేసింది. బోయపల్లి ఎస్సీ కాలనీలో వర్షపు నీరు ఇళ్లలోకి రావడంతో అక్కడి కాలనీవాసులు ఇంట్లో నుంచి బయటకు వచ్చారు. స్థానికులు అధికారులకు సమాచారాన్ని అందించడంతో తాండూర్ ఎస్సై కిరణ్ కుమార్ అక్కడికి వెళ్లి పరిస్థితిని సమీక్షించారు. వెంటనే మూడు జేసిబిలను పిలిపించి స్థానికుల సహాయంతో వర్షపు నీటిని తొలగించే ప్రయత్నం చేశారు. అలాగే కొత్తపల్లి, గోపాల్ నగరం, పెగడపల్లి గ్రామాల్లో పంట పొలాలు నీట మునిగాయి. కిష్టంపేటలో మండే శంకరమ్మ, అచ్చులాపూర్ లో గట్టు నానయ్య, పొట్లపల్లి రాజయ్య ఇళ్లలోకి వర్షపు నీరు చేరగా యాదగిరి ఇల్లు పాక్షికంగా కూలిపోయింది. అదేవిధంగా శనివారం వారాంతపు సంత, పెట్రోల్ బంక్ రేచీని రైల్వే స్టేషన్, బోయపల్లి బోర్డుల వద్ద గల మూడు అండర్ బ్రిడ్జిలలో వరద నీరు భారీగా చేరడంతో సుమారు 15 గ్రామాలకు పైగా రాకపోకులకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. జలమయమైన ప్రాంతాలను తాండూర్ తహశీల్దార్ యు జ్యోత్స్న, సీఐ దేవయ్య, ఎంపీడీఓ శ్రీనివాస్ లతో పాటు జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు సూరం రవీందర్ రెడ్డి, రెవెన్యూ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, స్థానిక ప్రజాప్రతినిధులు వెళ్లి పరిశీలించి తగిన చర్యలు తీసుకున్నారు.

# మాదక ద్రవ్యరహిత సమాజాన్ని నిర్మిద్దాం

జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే



**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్:** మాదకద్రవ్యరహిత సమాజాన్ని నిర్మిద్దామని, యువతలో మాదకద్రవ్యాల ప్రభావాన్ని తగ్గిద్దామని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. నషా ముక్త్ భారత్ అభియాన్ 5వ వార్షికోత్సవంలో భాగంగా బుధవారం జనకాపూర్‌లో గల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఎస్పీ కాంతిలాల్ సుభాష్‌తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మాదకద్రవ్యరహిత సమాజాన్ని నిర్మించి యువతపై చెడు ప్రభావాన్ని పూర్తిగా నిర్మూలిద్దామని అన్నారు. మాదకద్రవ్యాల వినియోగం కారణంగా ఆరోగ్యం, కుటుంబ సంబంధాలు దెబ్బతింటాయని తెలిపారు. మానసిక గందరగోళం ఏర్పడుతుందని పేర్కొన్నారు. జిల్లాలో మాదకద్రవ్య రవాణా, విక్రయం, వినియోగం చర్యలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. స్నేహితులు, బంధువులకు, కుటుంబ సభ్యులకు మాదకద్రవ్యాల వినియోగంతో కలిగే నష్టాలను వివరించాలని సూచించారు. యువత మాదకదవ్యాలకు దూరంగా ఉంటూ సన్మార్గంలో మంచి భవిష్యత్తును నిర్మించుకోవాలని తెలిపారు. ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో మాదకద్రవ్యాల వినియోగం, విక్రయం, గంజాయి సాగు చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎవరైనా గంజాయి సాగు, మాదకద్రవ్యాలు కలిగి ఉంటే వారి సమాచారాన్ని పోలీసులు అధికారులకు అందించాలని, వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. అనంతరం విద్యార్థులతో మాదకద్రవ్యాల రహిత సమాజ నిర్మాణంపై ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్, అధ్యాపకులు, సంబంధిత అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.



# మాదక ద్రవ్యాల రహిత సమాజం కోసం పాటుపడాలి

**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** మాదక ద్రవ్యాల రహిత సమాజం కోసం పాటుపడాలని ప్రదానోపాధ్యాయులు టి శ్రీనివాస్ స్వామి కోరారు. నషా ముక్త్ భారత్ అభియాన్ లో భాగంగా బుధవారం సుంకిడి ఉన్నత పాఠశాలలోని విద్యార్థులు సమాజంలో మాదకద్రవ్యాల నిరోధానికై మాదకద్రవ్య నిరోధక సామూహిక ప్రతిజ్ఞ విద్యార్థులతో చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు పౌరులను, తమ తల్లిదండ్రులను మాదకద్రవ్యాల వినియోగంపై చైతన్యం కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు గజానన్, రామ్ రెడ్డి, సుకుమార్ పెట్కులే, సుజాత, శ్రీనివాస్ రెడ్డి, సంజీవరెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ నాందేవ్ తదితరులు పాల్గొన్నారు.



# కృంగిన కల్వర్టుపై కలెక్టర్ కు ఫిర్యాదు


**ఉద్యమ కెరటం, తాండూర్:** తాండూర్ మండలంలోని నర్సాపూర్ గ్రామపంచాయతీ పరిధిలో నిర్మించిన కల్వర్టు దాదాపు 30 నుంచి 32 సంవత్సరాల క్రితం నిర్మించిన కల్వర్టు కృంగిన విషయంపై బుధవారం నర్సాపూర్ మాజీ సర్పంచ్, తుడుందెబ్బ తాండూర్ మండల అధ్యక్షులు కురిసింగ బాపూరావు జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ కు ఫిర్యాదు చేశారు. మంగళవారం రాత్రి కురిసిన కుండపోత వర్షంతో కల్వర్టు ఇప్పుడు కృంగిపోయిందని, దానిపై నుంచి వరద వాగును తలపిస్తుందని తెలిపారు. వర్షాకాలం గ్రామ పంచాయతీ పరిధిలోని 13 గ్రామాల ప్రజలకు రాకపోకలు, స్కూల్ పిల్లలకు, అత్యవసర వస్తువులకు, ఆరోగ్య పరిస్థితులు అనుకూలించనప్పుడు చాలా ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. దాదాపుగా 3 నుంచి 4 సంవత్సరాలుగా ఇదే పరిస్థితులు ఎదురవుతున్నాయని అన్నారు. అధికారులతో పాటు సింగరేణి అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదన్నారు. బుధవారం ఒక గర్భిణి స్త్రీకి 9 నెలలు నిండి పురిటి నొప్పులు రావడంతో మంగళవారం కురిసిన వర్షానికి ఆ కల్వర్టు దాటి గ్రామానికి అంబులెన్స్ రాలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. అంబులెన్స్ మళ్ళీ తిరిగి వెళ్లిపోవడం జరిగిందని, ఉదయం గ్రామస్తులు, పోలీసులు సహకారంతో అంబులెన్స్ పిలిపించి గ్రామం నుంచి ఆటోలో కల్వర్ట్ వరకు తీసుకొచ్చి కల్వర్టు నుంచి స్ట్రెచర్ లో తాడు సహాయంతో పోలీసులు గర్భిణీని వాగును దాటించి అంబులెన్స్ లో ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లడం జరిగిందన్నారు. ప్రభుత్వాలు మారిన గిరిజన గ్రామాలను పట్టించుకునే నాథుడు లేడని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే అధికారులు స్పందించి నూతన కల్వర్టు ఏర్పాటు చేయాలని కోరారు.

# ప్రజలు అప్రమత్తంగా ఉండాలి




**ఉద్యమ కెరటం, బెజ్జూర్:** మండలంలో మంగళవారం అర్ధరాత్రి నుంచి కురుస్తున్న భారీ వర్షాలకు ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని తహశీల్దార్ రామ్మోహన్ రావు తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశానుసారం మండలంలోని లోతట్టు ప్రాంత ప్రజలను అప్రమత్తం చేయడం జరిగిందన్నారు. గ్రామపంచాయతీ పోలీస్ సిబ్బంది అందుబాటులో ఉండాలని, ప్రతి సమస్యను ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు తెలియజేస్తారని అన్నారు. మండల వ్యాప్తంగా 56.4 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైనట్లు పేర్కొన్నారు. అత్యవసరం ఉంటే తప్పా ప్రజలు బయటికి వెళ్ళరాదని, ముఖ్యంగా చేపల వేట కోసం వాగులు, వంకల్లో వెళ్ళొద్దని సూచించారు. లోలెవెల్ వంతెనల వద్ద అధికారులను అప్రమత్తం చేయడం జరిగిందని తెలిపారు. అత్యవసర సమయంలో డయల్ 100 కు ఫోన్ చేయాలని, స్థానిక పోలీస్ కంట్రోల్ రూమ్ నం.8712670551 ఫోన్ చేసి సమాచారం అందజేయాలని సూచించారు.

# ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య



**ఉద్యమ కెరటం, నేరడిగొండ:** ఆర్థికంగా ఇబ్బందులతో వ్యక్తి మనస్థాపం చెంది ఆత్మహత్య చేసుకున్న ఘటన బుధవారం మండలంలోని కిష్టాపూర్ గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్సై ఇమ్రాన్ తెలిపిన వివరాల ప్రకారం.. కిష్టాపూర్ గ్రామానికి చెందిన శ్రీకాంత్ సోలాంకి (26) అనే యువకుడు ఇంటి అవసరాల నిమిత్తం దాదాపు రూ.5లక్షల వరకు అప్పు చేవాడు. చేసిన అప్పు ఎలా తీర్చాలానే ఆలోచన, రెండు రోజుల క్రితం భార్యభర్తల మధ్య గొడవ చోటుచేసుకుంది. అదే కోపంలో తీజ్ పండుగకు వెళ్తున్నానని భార్య పుట్టింటికి వెళ్ళిపోయింది. దీంతో మనస్థాపం చెంది ఇంట్లో ఎవరు లేని సమయంలో తాడుతో ఉరి వేసుకొని ఆత్మహత్య కు పాల్పడ్డాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి ఇద్దరు పిల్లలు ఉన్నారని తెలిపారు.

# మండల అధ్యక్షుడిగా ఆత్రం హరీష్



**ఉద్యమ కెరటం, బెజ్జూర్:** మండల కేంద్రంలో బుధవారం స్వేరో సర్కిల్ మండల కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు జిల్లా అధ్యక్షులు డోంగ్రి సురేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వేరో సుప్రీం డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఆదేశాల మేరకు స్వేరో రాష్ట్ర అధ్యక్షులు చిలక బత్తిని వీరయ్య పర్యవేక్షణలో జిల్లాలోని ప్రతి మండలంలో స్వేరో సర్కిల్ మండల కమిటీలను ఎన్నుకోవడం జరుగుతుందన్నారు. నూతనంగా ఎన్నికైన స్వేరో సర్కిల్ మండల కార్యవర్గానికి డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఆలోచనల విధానాలను వివరించడం జరిగిందని తెలిపారు. ఇదే స్ఫూర్తితో మండలంలోని ప్రతి గ్రామంలో స్వేరో సర్కిల్ నెట్వర్క్ విస్తరింపజేయాలని నూతన కార్యవర్గాన్ని కోరడం జరిగిందన్నారు. విద్యారంగా సమస్యలు, బహుజన వాదాన్ని బలపరుస్తూ ప్రతి గ్రామంలో స్వేరోయిజాన్ని చాటి చెప్పాలన్నారు. మండల అధ్యక్షులుగా ఆత్రం హరీష్, జనరల్ సెక్రెటరీగా మడావి సత్యవాన్, ఉపాధ్యక్షులుగా జునుగరి మహేష్, కోశాధికారిగా బెడికల సంతోష్, కోశాధికారిగా సూర్ల కళ్యాణ్ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. అనంతరం ఎన్నికైన కార్యవర్గానికి శాలువలతో సన్మానించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో స్వేరో సర్కిల్ జిల్లా నాయకులు మండల వాసులు తదితరులు పాల్గొన్నారు.

